క్లుప్తంగా

నందీశ్వరునికి ప్రత్యేక పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహా క్షేత్రంలోని స్వామి అమ్మవార్ల ఆలయప్రాంగణంలోని శనగన బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, శ్రీశైలక్షేత్ర పాలకునిగా ప్రసిద్ధిగాంచిన బయలు వీరభద్ర స్వామి వారికి మంగళవారం శాస్త్రోక్తంగా ఆలయ అధికారులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ప్రదోషకాల సమయంలో క్షేత్రపాలకుడైన వీరభద్రునికి, నందీశ్వరునికి అర్చనలను నిర్వహించారు. ఆరంభ పూజలలో భాగంగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. అనంతరం ఈ కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజ చేశారు. తరువాత నందీశ్వర స్వామికి నూతన వస్త్రసమర్పణ విశేషార్చనలు, నానపెట్టిన శనగలను క్షేత్రపాలకునికి ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూర నీరాజనాలు అర్పించారు.

కోనో కార్పస్ చెట్ల నరికివేత

శ్రీశైలం : శ్రీశైల క్షేత్ర పరిధిలోని పరిధిలో రోడ్ల డివైడర్ల మధ్యన పెంచిన కోనో కార్పస్ చెట్లను మంగళవారం దేవస్థానం సిబ్బంది నరికి తొలగిస్తున్నారు. కోనో కార్పస్ చెట్లు అత్యధిక స్థాయిలో కార్బన్‌డయాక్సైడ్ విడుదల చేస్తాయని కొన్ని రోజుల క్రితం శ్రీశైల హిందూ పరిరక్షణ సమితి ప్రతినిధులు దేవస్థానం ఈఈ రామకష్ణ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు స్పందించిన ఈఈ ఆ చెట్ల తొలగింపు చర్యలు చేపట్టడంతో హిందూ పరిషత్ పరిరక్షణ సమితి సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

సత్కారం



ఎస్‌ఐను సన్మానిస్తున్న టౌన్ సీఐ, పోలీసులు

నందికొట్కూరు: ఎస్‌ఐ వెంకటరమణ పట్టణ ప్రజలకు అందించిన సేవలు మరవలేనివని టౌన్ సీఐ ప్రకాష్‌కుమార్ తెలిపారు. అన్నమయ్య జిల్లాకు బదిలీపై వెళ్తున్న ఎస్‌ఐ వెంకటరమణను టౌన్ సీఐ, పోలీసులు మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు.

మల్లన్నకు నృత్య నీరాజనం



నృత్యప్రదర్శన ప్రదర్శిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలయ దక్షిణ మాఢవీధిలోని నిత్యకళా వేదికపై కర్నూలుకు చెందిన సూర్యకళా కల్చరల్ అకాడమీ కళాకారులు సంప్రదాయ నృత్యప్రదర్శన చేశారు. వినాయకకౌత్వం, గజవదన బేడువే, ఓం నమశ్శివాయా, ఓంకారరూపిణి, భో శంభో, నటేశకౌత్వం తదితర గీతాలకు గీతాశ్రీ, ఋూన్విశ్రీవల్లి, ఆర్ గీత, గురువిష్ణు, రచన, ఋుత్విక, హర్షిత, ప్రణతి, వేదశ్రీ తదితరులు నృత్య ప్రదర్శన చేశారు.

కేసీకి ఈనెలాఖరులోగా నీళ్లొచ్చే అవకాశం

జూపాడుబంగ్లా: తుంగభద్ర డ్యాం నిండటంతో ఈనెలాఖరులోగా కర్నూలు–కడప కాల్వకు సాగునీరు వచ్చే అవకాశాలున్నాయని ఏఈ శ్రీనివాసనాయక్ మంగళవారం తెలిపారు. ఎగువప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వల్ల తుంగభద్ర డ్యాం నిండిందన్నారు. ఇలాగే మరో రెండు, మూడు రోజులు వర్షాలు కురిస్తే డ్యాం గేట్లు ఎత్తి దిగువకు నీరు వదులుతారన్నారు. త్వరలో నంద్యాల జిల్లా ఐఏబీ సమావేశం నిర్వహించే అవకాశాలున్నాయని పేర్కొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

మిడుతూరు: మండల పరిధిలోని తలముడిపి గ్రామంలో ఓ చిన్నారిని కొట్టి గాయపరిచిన ఘటనలో ముగ్గురు మహిళలపై కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ జగన్‌మోహన్ మంగళవారం తెలిపారు. గ్రామానికి చెందిన శ్యామల కూతురు మైథిలి ఆడుకుంటూ ఇంటిపక్కన ఉన్న చాకలి ఉసేనమ్మకు చెందిన బట్టలు కింద పడేసింది. దీంతో ఆ చిన్నారిని ఉసేనమ్మతోపాటు ఇద్దరు మహిళలు రేణుక, వెంకటేశ్వరి కలిసి కాలికి చాలకితో వాతపెట్టారు. చిన్నారి తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వాహనాల తనిఖీ

మిడుతూరు: స్థానిక శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద మంగళవారం ఎస్‌ఐ జగన్‌మోహన్ వాహనాల తనిఖీ చేపట్టారు. ద్విచక్రవాహనదారులు తలకు హెల్మెట్ ధరించాలన్నారు. అనంతరం సరైన వాహన రికార్డులు లేని వారికి జరిమానాలు విధించారు.

పశు సంపదను సంరక్షించుకుందాం

మిడుతూరు: దేశీయ గోవు జాతులను సంరక్షించుకుని, అభివృద్ధి చేసుకుందామని నందికొట్కూరు అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ వరప్రసాదు అన్నారు. మంగళవారం రాష్ట్రీయ గోకుల మిషన్ కింద చింతలపల్లి గ్రామంలో పశువైద్యశిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పశువులకు సంక్రమించే వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో మిడుతూరు, చౌట్కూరు పశువైద్యాధికారులు డాక్టర్ సాయినాథ్‌రెడ్డి, డాక్టర్ చంద్రమోహన్, యాదవ్, ఏహెచ్‌ఏలు నరేష్, నిఖిత, వెటర్న రీ అసిస్టెంట్స్ విజయరాజు, అనిత పాల్గొన్నారు.

వానాకాలం..జర భద్రం!

- విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశాలు అధికం
- తడిచేతితో స్విచ్‌లు, బోర్డులు ముట్టుకోరాదు
- ఏదైనా సమస్య ఉంటే 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలి

నందికొట్కూరు: వర్షాకాలం ప్రారంభం కావడంతో రైతులు పంటల సాగుకు సమాయత్తమవుతున్నారు. అయితే, ఈసీజన్‌లో విద్యుత్ ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. కాస్త అప్రమత్తంగా వ్యవహరిస్తే ఈ ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు. వర్షకాలంలో వానలు, గాలులకు చెట్ల కొమ్మలతో పాటు విద్యుత్ స్తంభాలు విరిగి పడుతుంటాయి. విద్యుత్ తీగలు కిందకు వాలి ప్రమాదకరంగా కనిపిస్తుంటాయి. వానలు పడే సమయంలో వీటిని గమనించకపోతే ప్రమాదాలకు గురికావడం ఖాయం. పంట పొలాలకు వెళ్లే రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైన ఉంది. విద్యుత్ తీగలు తెగిపడి ఉన్నాయో లేదో ఒకటికి రెండు, మూడు సార్లు పరిశీలించుకుని నీళ్లలోకి దిగ్గాలి. మరో వైపు గ్రామీణ ప్రాంతాల్లో చాలా వరకు ట్రాన్స్‌ఫార్మర్లు ఇళ్ల మధ్యనే ఉంటాయి. వాటిలో చాలా వాటికి రక్షణ కంచెలు కూడా ఉండవు. విద్యుత్ తీగలు చెట్ల కొమ్మల మధ్య ఉండటం, పొలాల్లో వేసిన విద్యుత్ తీగలు చేతికి అందేలా ఉండటం, ఇళ్లకు సమీపంలో నుంచే తీగలు వెళ్లడం, స్తంభాలు విరిగిపోవడం, ఒరిగిపోవడం వంటి కారణాలతో ప్రమాదాలు చోటు చేసుకుంటాయి. వర్షాకాలంలో ఈ ముప్పు ఎక్కువగా ఉంటుంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా సమస్య ఉంటే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1912కు సమాచారం ఇవ్వాలని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు.

చేయకూడని పనులు ఇవే

- వర్షకాలంలో విద్యుత్ స్తంభాలను తాకే ప్రయత్నం చేయకూడదు.
- స్తంభాలను తాకుతూ వెళ్లే టెలిఫోన్, కేబుల్ టీవీ వైర్లను తాకే ప్రయత్నం చేయకూడదు.
- సబ్‌స్టేషన్ వంటి ప్రాంతాల్లో రక్షణ తీగలకు దూరంగా ఉండాలి.
- తడి దుస్తులు, తడి చేతులతో విద్యుత్ పరికరాలను తాకకూడదు, మరమ్మతులు చేయకూడదు.

ఇళ్లలో ఈ జాగ్రత్తలు అవసరం

- ఫ్రిజ్, వాషింగ్ మెషిన్ వంటి పరికరాల వద్దకు పిల్లలు రాకుండా చూడాలి.
- నీరు ఉన్న పరిసరాల్లో విద్యుత్ పరికరాలు ఉంచకూడదు.
- వర్షం కురిసే జల్లులు పడే అవకాశం ఉన్న చోట విద్యుత్ పరికరాలను ఉంచకూడదు. చేతులు తడిగా ఉన్నప్పుడు స్విచ్‌లను తాకకూడదు.
- ప్లగ్‌లను స్విచ్ ఆఫ్ చేయకుండా తీయకూడదు.
- నిపుణులతోనే ఇళ్లకు వైరింగ్ చేయించాలి.



ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



వర్షకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. విద్యుత్ తీగల్లో మార్పు గమనిస్తే వెంటనే సమీపంలోని విద్యుత్ కార్యాలయానికి సమాచారం అందించాలి. పలుచోట్ల స్తంభాలు పడిపోతున్నాయి. వాటిని మరమ్మతులు చేయిస్తున్నాం. ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే ముప్పు ఉండదు.

–శ్రీనివాసులు, విద్యుత్ శాఖ ఏడీ, నందికొట్కూరు డివిజన్

రిటైర్డ్ ఉద్యోగులకు అండగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

ఆత్మకూరు: ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులకు ప్రభుత్వం అండగా నిలువాలని, అన్ని సౌకర్యాలు కల్పించాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్, కర్నూలు రీజినల్ కార్యదర్శి శ్రీనివాసులు, అధ్యక్షుడు ఓబులేష్ కోరారు. పట్టణంలోని ఎంఎం ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం నిర్వహించిన ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సమావేశంలో వారు మాట్లాడారు. రిటైర్డ్‌మెంట్ అనంతరం అన్ని బెనిఫిట్స్ అందించాలని, ఇంటి స్థలాలను అందించి, ప్రభుత్వం ఉచితంగా వైద్య సదుపాయాలను కల్పించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు షరీఫ్, కరిముల్లా, కోశాధికారి వెంకటేశ్వర్లు, డిపో అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు హెచ్‌ఎండీ షరీఫ్, రీజినల్ కమిటీ అధ్యక్షుడు లింగన్న, పదవీ విరమణ పొందిన ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

మాయమాటలు నమ్మి మోసపోవద్దు



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ పావనిరెడ్డి

జూపాడుబంగ్లా: మాయమాటలు నమ్మి బాలికలు, యువతులు మోసపోవద్దని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పావనిరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని తరిగోపుల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మిషన్‌శక్తి కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పావనిరెడ్డి మాట్లాడుతూ బాలికలు రుతుస్రావం సమయంలో జాగ్రత్తలు తీసుకోవటంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే సమయంలో యువకులు, పురుషులు చెప్పే మాయమాటలను నమ్మి మోసపోవద్దన్నారు. అలాగే ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే వెంటనే ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సుధాకర్, అంగన్‌వాడీ వర్కర్లు శ్రీదేవి, రామతులసి, లక్ష్మీప్రసన్న, విద్యార్థినులు పాల్గొన్నారు.

ట్యాంకులను శుభ్రం చేయించండి

జూపాడుబంగ్లా: గ్రామాల్లోని తాగునీటి ఓవర్‌హెడ్, జీఎల్‌ఆర్ ట్యాంకులను ప్రతి పక్షం రోజులకోసారి శుభ్రం చేయించి నీటిని క్లోరినేషన్ చేయాలని ఎంపీడీఓ నూర్జహాన్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం ఆమె మండలంలోని మండ్లెం, తాటిపాడు గ్రామాల్లోని తాగునీటి ట్యాంకులు, అపరిశుభ్రత నివారణ చర్యలను పరిశీలించటంతో పాటు అంగన్‌వాడీ, ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం అంటువ్యాధుల సీజన్ కనుక గ్రామాల్లో ఎక్కడా చెత్తాచెదారం, మురికినీరు నిల్వలేకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గ్రామాల్లోని డ్రైనేజీలను శుభ్రం చేయించి బ్లీచింగ్ పౌడరు చల్లించాలన్నారు. వీలైతే దోమల నివారణ మందును డ్రైనేజీ కాల్వల్లో పిచికారీ చేయించాలన్నారు. . అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు మెనూ ప్రకారం భోజనం వండిపెట్టాలని నిర్వాహకురాలికి సూచించారు. ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో హాజరుపట్టికను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నూర్జహాన్

మినరల్ వాటర్ ప్లాంట్‌ను వినియోగంలోకి తేవాలి



ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ స్వాములు

పాములపాడు: మండలంలోని మిట్టకందాల గ్రామంలో నిరుపయోగంగా ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్‌ను వినియోగంలోకి తేవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ స్వాములు కోరారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ సరస్వతిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 10 సంవత్సరాల క్రితం ప్రజలకు శుద్ధి జలాన్ని అందించాలని ప్రభుత్వ సొమ్ముతో నిర్మించిన ట్యాంకు నేడు నిరుపయోగంగా మారిందన్నారు. ఇటీవల ప్రబలిన డయేరియాతో చాలా మంది ఇబ్బంది పడ్డారన్నారు. అధికారులు స్పందించి ప్రజలకు శుద్ధి జలాన్ని అందుబాటులోకి తేవాలని కోరారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

మహానంది : ప్రజారోగ్యంపై ప్రత్యేక దష్టి సారించాలని, పారిశద్ధ్య పనులు ఎప్పటికప్పుడు చేయించాలని నంద్యాల జిల్లా పంచాయతీ అధికారిణి మంజులావాణి తెలిపారు. మండల పరిధిలోని గాజులపల్లె గ్రామంలో మంగళవారం ఆమె పర్యటించారు. వీధుల్లో పర్యటించి పరసరాలను పరిశీలించారు. అదేవిధంగా ఆరోగ్య కేంద్రం, అంగన్‌దవాడీ కేంద్రాలను సందర్శించారు. అనంతరం డీపీఓ మంజులవాణి మాట్లాడుతూ పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలను చైతన్యపరచాలని ఆరోగ్య, వైద్య సిబ్బందిని ఆదేశించారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని సూచించారు. అదేవిధంగా ఉత్తమ సేవలు అందించిన పారిశుద్ధ్య కార్మికుడు మద్దిలేటిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస రెడ్డి, ఈఓఆర్డీ శివ నాగజ్యోతి, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ పవన్, గాజులపల్లె కార్యదర్శి మహమ్మద్ ఇర్ఫాన్, వెల్ఫేర్ అసిస్టెంట్ లింగమయ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీఓతో చర్చిస్తున్న డీపీఓ మంజులవాణి

మొక్కజొన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



మొక్కజొన్నలో నిలిచిన వర్షపునీటిని చూపుతున్న బైరాపురం షేక్‌మహబూబ్ బాషా

ఆత్మకూరు: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన మొక్కజొన్న అధిక వర్షంతో దెబ్బతిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కృషి పండ్లతోటల అసోసియేషన్ అధ్యక్షుడు బైరాపురం షేక్‌మహబూబ్‌బాషా కోరారు. ఈ మేరకు మంగళవారం దెబ్బతిన్న పంటను చూపుతూ కంటతడి పెట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న పంటలు వర్షపునీటి నిల్వలతో దెబ్బతిన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పంటలను పరిశీలించి హెక్టారుకు రూ.50 వేల వరకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆదుకోకుంటే ఆత్మహత్యలే శరణ్యమని వాపోయారు. కార్యక్రమంలో రైతులు ముసలిమడుగు నబిసాహెబ్, దుబ్బ లింగమూర్తి, అబ్దుల్‌రసూల్, మద్దూరు చాంద్‌బాషా, నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా సామాజిక తనిఖీ బహిరంగ సభ

కొత్తపల్లి: ఉపాధి హామీ పథకానికి సంబంధించి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించిన సామాజిక తనిఖీ బహిరంగ సభ తూతూ మంత్రంగా జరిగింది.మండలంలో 2023–24 సంవత్సరంలో జరిగిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ జరిగింది. ఇందులో వెలుగుచూసిన అవినీతి అక్రమాలను వెల్లడించేందుకు ఎంపీడీఓ జవహర్ బాబు అధ్యక్షతన 17 వ సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. జిల్లా పీడీ రామచంద్రారెడ్డి, జిల్లా విజిలెన్స్ అధికారి బాలాజీ నాయక్, ఆత్మకూరు క్లస్టర్ ఏపీడీ అన్వరా బేగం హాజరైన ఈ సమావేశంలో డీఆర్పీలు సామాజిక తనిఖీ రిపోర్టును చదివి వినిపించారు. మొత్తం మండలంలో ఎన్ఆర్ ఈజీఎస్, హార్టీకల్చర్, హౌసింగ్, ఐటీడీఏ, ఇతర శాఖల్లో రూ.9,27,95,240 విలువ చేసే పనులు జరిగాయి. అయితే ఇందులో సామాజిక తనిఖీ బృందాలు సుమారు 60 లక్షల వరకు అవినీతి జరిగినట్లు గుర్తిస్తే వాటిని అధికారులు రికవరీ పేరుతో రూ.2,02,000కు తగ్గించారు. అక్రమాలపై పూర్తి స్థాయి విచారణ జరపకుండానే సభను మూడుగంటల్లో ముగించడంపై ఉపాధి కూలీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎస్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో పనిచేసే ఇద్దరు అధికారులు సామాజిక తనిఖీ బృందాలకు గ్రామాల్లో ఎటువంటి అవినీతి జరగనట్టు చూపించాలని ముందుగానే చెప్పారని, దీంతో వారు తనిఖీలు తూతూ మంత్రంగా చేశారని వివిధ గ్రామాల ఉపాధి కూలీలు ఆరోపించారు. కొత్తపల్లి మండలంలో జరిగిన అవినీతి అక్రమాలపై మరోసారి విచారణ జరిపించి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, ఏపీఓ రేష్మ, రాజునాయక్, సామాజిక తనిఖీ ఎస్ఆర్పీ మురాద్, సర్పంచులు చంద్రశేఖర్ యాదవ్, జమిలాబి, బోరెడ్డి సరస్వతి, నక్క విజయ్‌కుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



కొత్తపల్లి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న సామాజిక తనిఖీ ప్రజావేదిక

28న పూర్వవిద్యార్థుల సమ్మేళనం

వెలుగోడు : స్థానిక ఎస్ఎస్ఎస్ఆర్ డిగ్రీ కళాశాల పూర్వవిద్యార్థుల(1985–88 బ్యాచ్) సమ్మేళనం ఈ నెల 28న ఏర్పాటు చేసినట్లు పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు రామలింగారెడ్డి, ఉపాధ్యక్షుడు జయరామిరెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం కళాశాలలో కొందరు పూర్వవిద్యార్థలతో కలిసి సమ్మేళనం ఏర్పాటుపై చర్చించారు. అనంతరం అధ్యాపకులను కలిసి కార్యక్రమం చేపడుతున్న తీరును వారు వివరించారు. పూర్వవిద్యార్థులు తప్పనిసరిగా హాజరు కావాలని వారు పిలుపునిచ్చారు.

భర్తపై ఫిర్యాదు

మహానంది: నిత్యం మద్యం సేవించడంతో పాటు అనుమానంతో భర్త వేధిస్తున్నాడని తిమ్మాపురం గ్రామానికి చెందిన షేక్ మలాల్ పోలీసులను ఆశ్రయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు.

బాలగంగాధరతిలక్ జయంతి

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాతీయ నాయకులు బాలగంగాధరతిలక్ జయంతిని నిర్వహించారు. తిలక్ త్యాగాలను ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.బుచ్చయ్య, అధ్యాపకుడు బాలు తదితరులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా.కె.రాజన్న, మహేశ్వరరెడ్డి, పూర్ణేశ్వరరెడ్డి, శర్మ, షాహిదా పాల్గొన్నారు.

చంద్రశేఖర్ ఆజాద్‌కు నివాళి

పగిడ్యాల: స్వాతంత్ర్య పోరాటంలో అశువులు బాసిన చంద్రశేఖర్ ఆజాద్ చిరస్మరణీయుడని ప్రధానోపాధ్యాయురాలు కౌసల్యాబాయి, ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగరాజు అన్నారు. చంద్రశేఖర్ ఆజాద్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం పాత ముచ్చుమర్రి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కొత్తపల్లి: గోకవరం గ్రామంలోని భక్తకన్నప్ప గురుకుల ఆవాసంలో మంగళవారం స్వాతంత్ర్య సమర యోధులు బాలగంగాధర్ తిలక్, చంద్రోశేఖర్ ఆజాద్‌ల జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఆవాసప్రముఖ్ రామకృష్ణ విద్యార్థులతో కలిసి వారి చిత్రపటాలకు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో జి.పుల్లారెడ్డి వైద్యశాల కో–ఆర్డీనేటర్ వాసుదేవరెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి

మహానంది: నాటిన మొక్కలను బాధ్యతగా సంరక్షించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ రామచంద్రా రెడ్డి తెలిపారు. బండిఆత్మకూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఉపాధి హామీ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్లాంటేషన్‌ను మంగళవారం పరిశీలించారు. పీడీ మాట్లాడుతూ మొక్కల సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఏపీఓ వసుధా రెడ్డి, సిబ్బందికి పీడీ సూచనలు చేశారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

మహానంది: బండిఆత్మకూరు మండలం జి.సి.పాలెం గ్రామంలో మంగళవారం ఉప సర్పంచ్ కంచెర్ల చిన్న లింగారెడ్డి ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేశారు. కార్మికులు కాలువల్లో పూడిక తొలగింపు చేపట్టారు. ప్రతిఒక్కరూ తమ ఇళ్ల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ఈ సందర్భంగా ఉప సర్పంచ్ కంచెర్ల చిన్నలింగారెడ్డి సూచించారు.

పండ్ల తోటల పెంపకం రైతులకు లాభసాటి

పగిడ్యాల: పంటల తోటల పెంపకం రైతులకు లాభసాటి వ్యవసాయమని అంబుడ్స్ పర్సన్ సురేంద్ర అన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వెనుక సాగు చేసిన మామిడి తోటను మంగళవారం ఆయన పరిశీలించారు. ఉపాధి హామీ పథకం రైతాంగానికి వరమని పేర్కొన్నారు. పండ్ల తోటల సాగు చేపట్టడం వలన ప్రభుత్వం ప్రతి ఏటా మెయింటనెన్స్ నిధులు మంజూరు చేస్తుందన్నారు. కాలానుగుణంగా రైతులు కూడా అప్డేట్ కావాలన్నారు. అనంతరం ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో సమావేశమై మస్టర్ నిర్వహణ, జాబ్‌కార్డుల జారీ, హాజరుపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కవిరాజు, ఈఓఆర్డీ నాగేంద్రయ్య, ఏపీఓ మద్దిలేటి, ఈసీ అశోక్, టీఏలు భాస్కర్, చంద్రశేఖర్, శ్రీకాంత్, ఫీల్డ్‌అసిస్టెంట్స్ రమేష్, రవి తదితరులు పాల్గొన్నారు.



పండ్ల తోటను పరిశీలించి సూచనలు చేస్తున్న అంబుడ్స్ పర్సన్ సురేంద్ర

నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తే చర్యలు



పెస్టిసైడ్ దుకాణంలో స్టాక్ రికార్డులను తనిఖీ చేస్తున్న ఏఓ

మిడుతూరు: నకిలీ విత్తనాలు, పురుగుల మందులు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ఏఓ పీరునాయక్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక బిస్మిల్లా పెస్టిసైడ్స్ దుకాణాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ నిషేధిత పురుగుల మందులు, కాలం చెల్లిన మందులు విక్రయించరాదన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు క్రయ, విక్రయాలు నిర్వహించాలని సూచించారు. పురుగుల మందులు విక్రయించిన రైతులకు రసీదులు ఇవ్వాలన్నారు. సంబంధిత కంపెనీలకు చెందిన అనుమతి పత్రాలు తప్పనిసరిగా ఉండే విధంగా చూసుకోవాలని పత్రాలు లేని పక్షంలో లైసెన్స్ రద్దు చేయబడుతుందని చెప్పారు. ధరల పట్టికను నోటీస్ బోర్డులో పెట్టాలని సూచించారు. అనంతరం స్టాకు రిజిష్టర్, బిల్లు బుక్‌లు తదితర వాటిని తనిఖీ చేశారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ అశోక్, సంబంధిత డీలర్ పాల్గొన్నారు.

నాణ్యత మేరకు స్కోప్ సర్టిఫికెట్

మహానంది: వరి కోతల తర్వాత ధాన్యాన్ని ల్యాబ్‌లో పరీక్షించి నాణ్యత మేరకు స్కోప్ సర్టిఫికెట్ అందిస్తారని ఏఓ నాగేశ్వర రెడ్డి తెలిపారు. నందిపల్లె గ్రామంలో మంగళవారం 'పొలంబడి' నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ స్కోప్ సర్టిఫికెట్ ద్వారా రైతులు పండించిన ధాన్యాన్ని అధిక ధరకు విక్రయించుకోవచ్చన్నారు. పర్యావరణానికి హాని లేకుండా సేంద్రియ ఎరువుల వాడకంతో తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడి సాధించవచ్చని వివరించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ నరసింహ రావు, ఏఈఓ శ్రీనివాసరెడ్డి, వీఏఏ లక్ష్మీకాంత్, రైతులు పాల్గొన్నారు.



పొలంబడి కార్యక్రమంలో ఏఓ, రైతులు

కౌలు కార్డులు తీసుకోండి

పాములపాడు: మండలంలోని ప్రతి కౌలు రైతు సీసీఆర్‌సీ కార్డులు పొందాలని మండల వ్యవసాయాధికారి ఫణీశ్వరరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 62 శాతం మంది కౌలు రైతులకు కార్డులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. మండలంలోని 13 ఆర్బీకే కేంద్రాల పరిధిలో ఈ సంవత్సరం టార్గెట్ 750 మందికి ఇవ్వాల్సి ఉందన్నారు. కాగా ఇప్పటి వరకు 467 మందికి పంపిణీ చేసినట్లు చెప్పారు.

యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మధుశేఖర్

నందికొట్కూరు: సమాజాభివృద్ధిలో కీలకమైన యువతకు ప్రభుత్వాలు ఉపాధి అవకాశాలు కల్పించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మధు శేఖర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో యువకులు మద్యం, గంజాయి, పేకాట వైపు అడుగులు వేస్తున్నారన్నారు. యువత సరైన మార్గంలో సాగకపోతే సమాజాభివృద్ధి కుంటుపడుతుందని చెప్పారు. ఈ నెల 27వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నంద్యాల పట్టణంలో జరిగే రాష్ట్ర క్లాసులకు యువత హాజరుకావాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన డీవైఎఫ్ఐ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఆత్మకూరు డివిజన్‌లో భారీ వర్షాలు

- పొంగిన వాగులు, వంకలు

ఆత్మకూరు: ఎడతెడిపవ్వకుండా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ఖరీఫ్ ప్రారంభం నుంచి ఆత్మకూరు డివిజన్‌లో రికార్డుస్థాయిలో వర్షాలు కురిశాయి. మే నుంచే సాధారణ వర్షపాతం కంటే మూడింతల వర్షపాతం అధికంగా నమోదయ్యింది. దీంతో ఆత్మకూరు డివిజన్ పరిధిలోని అతిపెద్ద నది అయిన బవనాసి, సుద్దవాగు, గుండ్లకమ్మవాగు, పెద్దలేరు నదులు పొంగి ప్రవహించాయి. బవనాసి నది 15 రోజులుగా నిండుకుండలా ప్రవహిస్తోంది. నల్లమలలో అత్యధికంగా వర్షాలు కురవడంతో దిగువ నదులకు భారీగా వరదనీరు చేరింది. మే నెలలో సాధారణంగా 29 సెం.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా రికార్డుస్థాయిలో 139.4 మి.మీ. వర్షపాతం నమోదు అయ్యింది. జూన్‌లో సాధారణంగా 92 మి.మీ. వర్షం నమోదు కావాల్సి ఉండగా 250.2 మి.మీ. వర్షపాతం నమోదయ్యింది. ఆత్మకూరు డివిజన్ పరిధిలోని శ్రీశైలం మండలంలో జూలైలో సాధారణంగా 165.5 మి.మీ, వర్షం కురవాల్సి ఉండగా ఇప్పటికే 140 మి.మీ నమోదు అయ్యింది. ఆత్మకూరు మండలంలో 165 మి.మీ, గానూ 257.2 మి.మీ, కొత్తపల్లి మండలంలో సాధారణంగా 179. మి.మీ.కు గానూ 225 మి.మీ, పాములపాడు మండలంలో 174 మి.మీ.కు గానూ 192 మి.మీ, వెలుగోడు మండలంలో 170 మి.మీ.కు గానూ 200 మి.మీ. వర్షం పాతం అత్యధికంగా నమోదయ్యింది.



ఉధృతంగా ప్రవహిస్తున్న బవనాసి వాగు

నాటు సారా తయారు చేస్తే చర్యలు

నందికొట్కూరు: ఎవరైనా నాటు సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ శ్రీనివాసులు హెచ్చరించారు. బ్రాహ్మణకొట్కూరు పోలీసు స్టేషన్ పరిధిలో పట్టుబడిన నాటు సారాయి, మద్యం బాటిళ్లను మంగళవారం డీఎస్పీ ఆధ్వర్యంలో జేసీబీతో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం తీసుకొచ్చి విక్రయించేవారిపై నిఘా పెట్టాలని పోలీసులకు సూచించారు. ఆయన వెంట రూరల్ సీఐ బీఆర్ కృష్ణయ్య, ఎస్‌ఐ నాగార్జున ఉన్నారు.



మద్యం బాటిళ్లు, నాటుసారాను జేసీబీతో ధ్వంసం చేస్తున్న పోలీసులు